రోడ్లు అధ్వానం..ఒళ్లు హూనం

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- గతుకుల రోడ్లతో ప్రజలకు తప్పని తిప్పలు

లేపాక్షి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు, వాహనదారులకు ప్రయాణం నరక యాతనను తలపిస్తోంది. గ్రామాల నుంచి మండలం లేదా పట్టణాలకు వెళ్లాలంటే రోడ్లు కంకర తేలడం, గుంతలు పడడం, వర్షాలకు రోడ్లు దెబ్బ తినడంతో ప్రయాణం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయడం లేదా గుంతలు పూడ్చడం, వర్షానికి కోసిన రోడ్డుకు మట్టి కూడా వేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది.

నిత్యం కష్టాలే..

మండలంలోని కల్లూరు నుంచి బైరాపురం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా వుండడంతో బైరాపురం నుంచి వచ్చే విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే కొత్తపల్లి - పులమతి, మానేపల్లి - గొరిగానిపల్లి, మానేపల్లి క్రాస్- వెంకటాపురం, తిరుమలదేవరపల్లి- శిరివరం, తిరుమలదేవరపల్లి - హిందూపురం, కొత్తపల్లి- కోడిపల్లి రోడ్లు గుంతలు పడటంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గ్రామీణరోడ్లను బాగు చేసి ప్రయాణ కష్టాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలు ఏర్పడిన కుర్లపల్లి రోడ్డు



కంకర తేలిన బైరాపురం రహదారి

విద్యార్థులకు ఇబ్బందులు

మా గ్రామానికి రోడ్డు అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును బాగు చేయాలని అనేక మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్న వించిన ప్రయోజనం లేక పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

–సోమశేఖర్‌రెడ్డి, బైరాపురం

రోడ్డు మరమ్మతు చేయాలి

మా గ్రామం నుంచి లేపాక్షి లేదా హిందూపురం వెళ్లాలంటే నరకయాతనంగా అనిపిస్తోంది. లేపాక్షి నుంచి కొండూరు, కుర్లపల్లి, తిమ్మగానిపల్లి, చలివెందల గ్రామాలకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డులో ఎక్కడ గుంత, మిట్ట ఉందో తెలియని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతు చేయాలి.

–నాగరాజు, కుర్లపల్లి

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి అశోక్ కుమార్

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మడకశిర కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఆర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదన్నారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చట్టం ముందు ఎంతటి వారైనా సమానమేనని తెలిపారు.

బ్యాంకుల వద్ద జాగ్రత్తలు తీసుకోండి



బ్యాంకర్లకు జాగ్రత్తలు తెలియజేస్తున్న డీఎస్పీ నరసింగప్ప

పెనుకొండ: బ్యాంకుల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ నరసింగప్ప బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. హిందూపురం స్టేట్‌బ్యాంక్‌లో భారీ చోరీ జరిగిన నేపథ్యంలో బ్యాంకర్లతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాలు పకడ్బందీగా పని చేసేలా చూసుకోవాలని, రాత్రి వేళల్లో బ్యాంక్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఏఐఎస్ఎఫ్ బాలికల కమిటీ ఎంపిక



బాలికల కమిటీని ఎంపిక చేస్తున్న జిల్లా అధ్యక్షుడు

పెనుకొండ: పట్టణంలోని సత్యసాయి కళాశాలలో జిల్లా అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో బాలికల కమిటీని శనివారం ఎంపిక చేశారు. అధ్యక్షురాలుగా షబానా, కార్యదర్శిగా కీర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సురేయాతోపాటు మరో 51 మందితో బాలికల కమిటీని ఎంపిక చేశారు. సీపీఐ జిల్లా లిబరేషన్ నాయకురాలు కన్యాకుమారి, డివిజన్ నాయకులు అనిల్, పునీత్, గణేష్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి: ఉప్పరపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పదోన్నతిపై మడకశిరకు వెళ్తున్న శ్రీనివాసరెడ్డిని ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప ఆధ్వర్యంలో జేఏసీ ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. అదేవిధంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ ఆలయానికి శ్రీనివాసరెడ్డి రూ. 5116 ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

బ్లాంకెట్ సర్వేకు సహకరించండి



మాట్లాడుతున్న పశువైద్య సహాయకుడు షేక్ అబ్దుల్ రహీం

హిందూపురం: పాడి, సన్నజీవాల పెంపకం రైతులు బ్లాంకెట్ సర్వేకు సహకరించాలని రైతుసేవా కేంద్రం పశువైద్యసహాయకుడు షేక్ అబ్దుల్ రహీం సూచించారు. బేవినాహళ్లి పంచాయతీలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి, సన్నజీవాల పెంపకం దారులకు రుణ సౌకర్యం, పశుబీమా పరిహారంలో ఎదుర్కొంటున్న సమస్యలు, పాడి రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, పశువైద్యంపై సెప్టెంబరు 15 వరకు సర్వే నిర్వహిస్తాం దన్నారు. ఎంపీటీసీ అశ్విని, వార్డు సభ్యులు ముత్తన్న, నాగరాజు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కారం

పెనుకొండ: కురుబవాండ్లపల్లిలో దారి సమస్య ఎస్పీ రత్న చొరవతో పరిష్కారమైంది. స్థానిక ఎస్సీ కాలనీకి వెళ్లే దారిని సూచిస్తూ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాలనీ బోర్డును కొందరు గ్రామస్తులు శుక్రవారం తొలగించారు. ఎస్సీ కాలనీవాసులు హరిపురం వద్ద హైవేపై నిరసన తెలియజేశారు. ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ నరసింగప్ప, కియా ఎస్ఐ రాజేష్, తహసీల్దార్, ఎంపీడీఓ విచారణ చేసి, ఎస్సీ నాయకులు, సర్పంచు నాగమూర్తితో శనివారం మాట్లాడారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బోర్డును తిరిగి ఏర్పాటు చేయించారు.

విభిన్న ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు

హిందూపురం టౌన్: పట్టణంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు ఎంఈఓ గంగప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరంలో పరీక్ష చేయించుకున్న విద్యార్థులకు జనవరిలో వివిధ ఉపకరణాలు అందజేస్తామన్నారు. భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను తెలియజేశారు. హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు నుంచి వచ్చిన విభిన్న ప్రతిభావంతులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ- 2 ప్రసన్న లక్ష్మీ, ఎంజీఎం హెచ్ఎం రంగనాయకులు, సూర్యనారాయణ, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

‘స్వార్థం కోసం ఆరోపణలు’

హిందూపురం టౌన్: కొందరూ స్వార్థం కోసం లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ మేరకుసభ్యులు ఇందాద్, మల్లికార్జున తదితరులు శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. లారీ అసోసియేషన్‌ను గుప్పిట్లో పెట్టుకుని వందలాది మంది నోట్లో మట్టికొట్టేలా కొందరూ వ్యవహరిస్తున్నారన్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ద్వారా వేలాది కుటుంబాలు జీవనం గడుపుతున్నారని, అసోసియేషన్‌లో లారీలకు లోడ్ దొరక్క ఈఎంఐలు కట్టలేక ఉన్న లారీలను అమ్ముకొని ఓనర్లు డ్రైవర్లుగా, డ్రైవర్లు కూలీలుగా జీవిస్తున్నారని ఆవేదన చెందారు. ఇలాంటి ఆరోపణలు మానుకోవాలని వారు అన్నారు.

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

పెనుకొండ: పట్టణంలోని దర్గా సర్కిల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.సుధాకరరెడ్డి, పట్టణ కన్వీనర్ బోయ నరసింహ తెలిపారు. నియోజకవర్గ సమన్వయ కర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

సోమందేపల్లి: చాలకూరు, కేతగాని చెరువు గ్రామాల్లో ‘బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ’ కార్యక్రమం ఆదివారం జరగనుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పాల్గొంటారని తెలిపారు.

పరిగి: బీచిగానిపల్లిలో ఆదివారం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. బాబూ ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులుప్రజాప్రతినిధులు, పాల్గొనాలని కోరారు.

అమరాపురం: హలుకూరు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర యాక్టివిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ గంగుల సుధీర్ రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలి రావాలని కోరారు.

మడకశిర మండలంలో..

మడకశిరరూరల్: చందకచెర్లు, గౌడనహళ్లి పంచాయతీల్లో ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు చందకచెర్లులో, 11 గంటలకు గౌడనహళ్ళి పంచాయతీల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు హాజరుకానున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

మడకశిర: పట్టణంలోని 1, 2, 3, 8వ వార్డుల్లో ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్ కుమార్ తెలిపారు. పార్టీ టౌన్ ఇన్‌చార్జ్ భారతి రెడ్డి దేశాయి అతిథిగా హాజరవుతారన్నారు.

గుడిబండ మండలంలో..

గుడిబండ: మండలంలోని మోరబాగల్, గుణేమోరుబాగల్ గ్రామంలో ‘బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తెలిపారు.

చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మరు

లేపాక్షి: సీఎం చంద్రబాబు అధికారంలోకి రావడానికి ప్రజలకు అనేక మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన అనంతరం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్నారని, చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి పేర్కొన్నారు. శనివారం నాయనిపల్లి, మామిడిమాకులపల్లిలో మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్ అధ్యక్షతన జరిగిన బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో నగదు వస్తుందని నమ్మించి మోసం చేశారని విమర్శించారు. బాబు మోసాలు, అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు, గ్యాస్ డబ్బులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అందాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అయితే తల్లికి వందనం అందరికీ ఇస్తామని చెప్పి కొందరికి మాత్రమే ఇచ్చారని ప్రజలు వాపోయారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీల బేధం లేకుండా పథకాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, కోఆప్షన్ సభ్యులు బషీర్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, జయశంకర్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, తిప్పన్న, రామాంజనేయులు, షేక్‌బాబు, ఫక్రుద్దీన్, శివశంకర్‌రెడ్డి, విజయకుమార్, నారాయణప్ప, గంగాధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశులు, చాంద్‌బాషా, కృష్ణారెడ్డి, నరసింహులు, శీన, రాజు, విజయకుమార్, అశ్వత్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మామిడిమాకుపల్లిలో బాబు మోసాలను వివరిస్తున్న నాయకులు



నాయనిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న వేణురెడ్డి

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించండి

హిందూపురం: కోర్టులో కేసులు సత్వర పరిష్కారం కోసం పోలీసులు, న్యాయవాదులు సహకరించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ కోరారు. శనివారం ఏడీజే కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ సెప్టెంబర్ 13న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉంటుందన్నారు. ఇందులో చెక్ బౌన్స్, బ్యాంక్, భరణం, సివిల్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ల వారీగా ఎన్ని కేసులు పరిష్కరించుకునే అవకాశందో ఉందో ఏడీజే అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ముందుగానే కేసులను పరిష్కరించేందుకు వీలుగా ప్రీ సిట్టింగ్ నిర్వహిస్తామన్నారు. కేసుల పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు, న్యాయవాదులు సుదర్శన్, సిద్దు, గోపాలకృష్ణ, సంతోషి కుమారి, నవేరా, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మెగా లోక్ అదాలత్ నిర్వహణపై మాట్లాడుతున్న ఏడీజే శైలజ

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

లేపాక్షి: మానేపల్లి, లేపాక్షి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సీడీపీఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయా కేంద్రాల పరిధిలో తల్లులు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నిర్మల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: కెకె పాళ్యం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం త్రివేణి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడుతాయన్నారు.

పరిగి: తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. శనివారం కొడిగెనహళ్లిలో మూడో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగనవాడీ కార్యకర్త సంధ్యారాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని చీపులేటిలో శనివారం తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



కొడిగెనహళ్లిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

చల్లగా చూడు శనీశ్వరా..



అమరాపురం: శనీశ్వర స్వామికి పూజలు



వివిధ పూలతో అలంకరించిన దృశ్యం



అలంకరణలో ఆంజనేయుడు

అమరాపురం: మండలంలోని వివిధ ఆలయాల్లో శనివారం శ్రావణమాస సందడి నెలకొంది. అమరాపురం, హెచ్‌బీఎస్ కాలనీ, ఆలదపల్లి తదితర గ్రామాల్లో వెలసిన శనీశ్వర స్వామికి అర్చకులు పూజలు చేశారు. స్వామికి సుప్రభాత సేవ, తైలాభిషేకం, నవగ్రహ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని అలంకరించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు.

గుడిబండ: శ్రావణ శనివారం సందర్భంగా మండల పరిధిలోని ఫళారం గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామికి పూజలు చేశారు. విగ్రహానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, గంగాజలంతో అభిషేకం చేశారు. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

అగళి: మండలంలో శ్రావణ శనివారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొడిహళ్లి ఆంజనేయ స్వామి, రావుడి ఆంజనేయ స్వామి, శనీశ్వర స్వామి, మధూడి వీరభద్ర స్వామి తదితర ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. స్వామిని ప్రతేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

నాణ్యమైన భోజనం అందించండి

పెనుకొండ: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన భోజనం అందేలా చూడాలని ఆర్జేడీ సురేష్ బాబు, డీఐఈఓ చెన్నకేశవప్రసాద్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రం అందించారు. కళాశాలల్లో వంట గదులు లేవని, పాఠశాలల్లో వంట చేసి, పార్శిల్ తీసుకొని వెళ్లి వడ్డిస్తున్నారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆగిన నాడు–నేడు భవనాలు పూర్తి చేయాలన్నారు. కళాశాలల టైమింగ్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వం నిర్ణయించిందని, దీంతో దూర ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. నాయకులు శ్రవణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పడలేదయ్యా..

ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ‘తల్లికి వందనం’ అందజేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. గెలిచాక మొండిచేయి చూపుతోంది. మడకశిర మండల వ్యాప్తంగా విద్యార్థులకు అరకొరగా నగదు జమ చేసి చేతులు దులుపుకుంది. అధికారులు తెలిపిన సమాచారం మేరకు ఇంకా 180 మందికి తల్లికి వందనం డబ్బు జమ కావాల్సి ఉంది. శనివారం తమ పిల్లలకు తల్లికి వందనం డబ్బు పడలేదని తల్లిదండ్రులు ఎంఈఓ భాస్కర్‌ను కలసి అర్జీలు అందజేశారు. ‘మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఒకరికి మాత్రమే తల్లికి వందనం డబ్బు పడింది. మిగిలిన ఇద్దరు పిల్లలకు ఇప్పటి వరకు డబ్బు పడలేదు’ అని ఎం.రంగాపురం గ్రామానికి చెందిన అశ్వర్థ నారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. నిత్యం ఎమ్మార్సీ కార్యాలయం, గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ.. తల్లికి వందనం డబ్బు జమ కాని విషయాన్ని జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

– మడకశిరరూరల్:



ఎంఈఓ భాస్కర్‌కు అర్జీ చూపుతున్న విద్యార్థి తల్లి

కళాశాలలో అడ్మిషన్లు పెంచండి



ఓరియంటేషన్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ఆర్జేడీ తదితరులు

పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచాలని ఆర్జేడీ సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కళాశాలలో జిల్లా స్థాయి మ్యాథ్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆర్జేడీ డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ లెక్కల అధ్యాపకులకు మ్యాథ్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రధానంగా కళాశాలలో అడ్మిషన్లు పెంచాలని, కళాశాలకు చేరని విద్యార్థులకు ప్రభుత్వ పథకాలపై తెలియజేయాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చెన్నకేశవ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడంతో అడ్మిషన్ల సంఖ్య పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, అధ్యాపకులు మూర్తి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

11 వరకు గడువు పెంపు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 11 వరకు గడువు పెంచినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

టీస్టాల్‌లో దొంగలు పడ్డారు..

చిలమత్తూరు: కొడికొండ చెక్‌పోస్టులోని టీ స్టాల్‌లో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. మంజుళ అనే మహిళ టీస్టాల్ షట్టరు తాళాలు పగులగొట్టి అందులో రూ. 30 వేలు నగదు, రూ.7 వేలు విలువ చేసే సిగరెట్లు దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. ఇదిలా ఉండగా నిత్యం వాహనాల రద్దీ, లైట్లు ఉండే ప్రాంతంలో చోరీ జరగడం స్థానికులను కలవరపెడుతోంది. టీస్టాల్ పక్కనే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, రెండు ఏటీఎం లు ఉన్నాయి.

సంక్షిప్త సమాచారం

తప్పిన పెను ప్రమాదం

పెనుకొండ: దొడ్డికుంట సమీపంలో శనివారం ఐచర్ వాహనం (కంటైనర్) అదుపు తప్పిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. పాలసముద్రం సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమ నుంచి కార్ల విడిభాగాలతో వెళ్తున్న ఐచర్ వాహనం దొడ్డికుంట సమీపంలో డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో వాహనం అదుపు తప్పి డివైడర్ దాటుకుని అవతల రోడ్డులో గుంతలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో పెనుకొండ వైపు నుంచి వాహనాలు రాకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



గుంతలో నిలబడిన వాహనం

పోలీసుస్టేషన్‌లో పాము కలకలం

హిందూపురం: పట్టణంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో పాము శనివారం రాత్రి కలకలం రేపింది. పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కట్టపై పాము కనిపించింది. స్టేషన్‌కు వచ్చిన వారు భయపడి పోలీసులకు తెలియజేశారు. దీంతో పోలీసులు వెంటనే పాములు పట్టే వ్యక్తిని పిలిపించారు. సదరు వ్యక్తి పామును పట్టి అటవీ ప్రాంతంలో వదిలేశాడు.



పోలీసుస్టేషన్‌లో పాము పట్టుకుంటున్న వ్యక్తి

కేబుల్ చోరీ

సోమందేపల్లి: చిన్న బాబయ్యపల్లిలో పంచాయతీ బోరు కేబుల్ చోరీ అయినట్లు కార్యదర్శి శాంతి స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.15 వేలు విలువైన వైరు అపహరణకు గురైందన్నారు. తరచూ కేబుల్ వైర్లు చోరీ జరుగుతున్నాయని సర్పంచ్ గంగమ్మ తెలిపారు.

పోల్ సెంటర్ ప్రారంభం

పెనుకొండ: పట్టణంలో 20 ఏళ్ల క్రితం మూతపడిన పోల్ సెంటర్‌ను మంత్రి సవిత శనివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పోల్ సెంటర్‌ను రూ.3.5 కోట్లతో పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సంపత్, డీఈ విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటునందించండి

పెనుకొండ: మండలంలో విద్యాభివృద్ధికి తగిన విధంగా తోడ్పాటు అందించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు నూతన ఎంఈఓ టి.రాఘవయ్యను కోరారు. నూతన ఎంఈఓ రాఘవయ్యను రాష్ట్ర అధ్యక్షుడుతో పాటు పలువురు జిల్లా, మండల నాయకులు కలసి శనివారం సన్మానించారు. ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్, విజయ్‌కుమార్, బాబు, వలి, ఉపాధ్యాయినులు అనసూయమ్మ, యశోదమ్మ, ఆనందమ్మ, రాధమ్మ, రాధిక, షహబాజ్‌బాను పాల్గొన్నారు.



నూతన ఎంఈఓను సన్మానిస్తున్న స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

నూతన ఎంఈఓకు సన్మానం

రొద్దం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో నూతన ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన అరవింద్‌కుర్‌ను ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. ఉపాధ్యాయులందరి సహకారంతో, అందరినీ సమన్వయం చేసుకుని మండల విద్యాభివృద్ధికి కృషి చేస్తామని ఎంఈఓ అరవింద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 జయభాస్కర్, ఉపాధ్యాయులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.